

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## మండి

**భాష:** హిందీ, **దర్శకత్వం** - శ్యాం బెనగల్; నటీనటులు - షబనా ఆజ్మీ, స్మితాపాటిల్, నసరుద్దీన్ షా, ఓంపురి

**విడుదల:** 1983




**వేశ్యల జీవితాల్ని ఇతివృత్తాలుగా చేసుకుని** భారతీయ సినిమా రంగంలో అనేక చిత్రాలు నిర్మించబడ్డాయి. కొన్నింటిలో అయ్యో పాపం అన్న సానుభూతితోనూ, మరికొన్నింటిలో మానవతా దృక్పథంతోనూ నిర్మించిన చిత్రాలు కొన్ని మాత్రమే వచ్చాయి. వేశ్యల వ్యక్తిత్వాల్ని ఇరుసుగా చేసుకుని వారి జీవితాల్ని ఆవిష్కరిస్తూ నిర్మించిన అతి కొద్ది సినిమాల్లో శ్యాంబెనగల్ నిర్మించిన 'మండి' ప్రముఖమయింది.

భారతీయ చలనచిత్ర చరిత్రను పరిశీలిస్తే 1924లో దాదాసాహెబ్ ఫాల్కె కెన్యా విక్రమ్, 1925లో 'దేవదాసి' తదితర చిత్రాల్ని నిర్మించాడు. ఆ తర్వాతి కాలంలో మిడ్ నైట్ గర్ల్ (1929), సొసైటీ బటర్ ఫ్లై (1926), వాంప్ (1926), గుట్బార్ గులాబ్ (1927) లాంటి చిత్రాలు నిర్మితమయ్యాయి. ఇవన్నీ మూకీ చిత్రాలే. వీటిల్లో ప్రధానంగా వేశ్యల జీవితాల్లోని ఉపరితల అంశాలే ప్రధానంగా నిలిచాయి.

ఆ తర్వాతికాలంలో దేవదాస్, ప్యాసా, మొగల్ ఎ అజమ్, పాకీజా మొదలైన సినిమాల్లో వేశ్యల పాత్రల్ని ఉన్నతీకరిస్తూ చూపించారు. ఆ తర్వాత బి.ఆర్.ఇషారా నిర్మించిన 'చేతనా', టి.ఎస్.రంగా నిర్మించిన 'గిద్' లాంటి చిత్రాలు వేశ్యల ఇతివృత్తాలపై వచ్చాయి. ఇలా ఇంకా అనేక చిత్రాలు నిర్మితమయినప్పటికీ వేశ్యలు, వేశ్యావృత్తి, వేశ్యా వ్యవస్థల్ని సాధికారికంగా అధ్యయనం చేసి వారి జీవితాల్లోని చీకటి వెలుగుల్ని సజీవంగా చూపించిన చిత్రం 'మండి'. ఇందులో వేశ్యా జీవితాల్లో ఉండే సుఖాలు, దుఃఖాలూ, వెలుగులు, చీకట్లో కాకుండా వారు ఉత్సాహంగా వేసే చిందులు, వారి విందులు, వినోదాలూ వారి వారి మురిపాలూ అన్నీ కనిపిస్తాయి. అన్ని కోణాల్నించీ వారి జీవితాలు ఆవిష్కృతమవుతాయి.

ఈ చిత్రంలో ముఖ్యంగా ఒక వేశ్యావాటిక వారు నివసిస్తూ ఉన్న స్థలాన్ని ఆక్రమించడానికి భూ ఆక్రమణ దారులు వేసే పన్నాగాలూ వారికీ ఆ ప్రాంతం నుంచి కదిలిపోయిన వేశ్యలకూ మధ్య జరిగిన సంఘర్షణ మూల కథాంశం మాత్రమే. కానీ చిత్రం యావత్తూ వేశ్యల జీవిత చిత్రణే ప్రధాన ఇతివృత్తంగా ఉంటుంది.

మండిలో ప్రధాన పాత్ర రుక్మిణి బాయి. ఆమె ఆధ్వర్యంలో ఆ వేశ్యాగృహం నడుస్తూ ఉంటుంది. వారు అప్పటిదాకా ఉంటున్న స్థలాన్ని ఖాళీ చేయాల్సి రావడంతో వారంతా ఊరు బయట క్యాంపు ఏర్పాటు చేసుకుని ఉంటారు. కొంతకాలానికి మొత్తం ఊరు ఆ క్యాంపు వైపు తరలి వస్తుంది. రుక్మిణిబాయి పాత్రను పోషించిన షబనా ఆజ్మీ ఈ చిత్రం కోసం అధిక శ్రమను తీసుకున్నారు. షూటింగుకు ముందు హైదరాబాద్‌లోని ఓ కోఠాను పరిశీలించి అక్కడి వేశ్యల మేనరిజంలను తీరుతెన్నుల్నీ అధ్యయనం చేశారామె. అంతేకాదు మేడమ్‌గా ఉండడానికి ఓ 20 పౌన్ల బరువును కూడా పెంచుకున్నారు. ఇక ఉర్దూ కల్సిన హైదరాబాదీ హిందీని మాట్లాడ్డంలో ఆమె గొప్ప ప్రతిభను కనబర్చారు.

వేశ్యాగృహాన్ని నడిపించడంలో రుక్మిణీ బాయి ఏకకాలంలో వగలునూ, ప్రేమనూ క్రూరత్వాన్ని, మిత్రత్వాన్ని, ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తుంది. తన వాళ్ళని రక్షించుకునేందుకు తన స్థానాన్ని రక్షించుకునేందుకు ఆమె ఎప్పటికప్పుడు కొత్త పోకడలు పోతుంది. మధ్య తరగతి జనాల్లో ఉండే కుహనా విలువల్ని ఆమె తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. ఆమె తమ కష్టమర్లతోనూ, అమ్మాయిలతోనూ వ్యవహరించే తీరును దర్శకుడు అద్భుతంగా చిత్రీకరించారు. ఆ క్రమంలో శ్యాం బెనగల్ వేశ్యావృత్తిని సెంటిమెంటలైజ్ చేయడం గానీ, ఐడియలైజ్ చేయడం కానీ చేయడు. అది ఆయన అవగాహనా స్థాయికి దాఖలా.

'మండి' చిత్రంలో మరో ముఖ్యమైన అంశం అందులో కూర్చబడిన మూడు పురుష పాత్రలు. ఒకడు ప్రేమాస్పదుడయిన హవల్దార్. అతడు వేశ్యాగృహంలోని వారికి రక్షణ కల్పిస్తున్నాననే నెపంతో రోజుకో స్త్రీతో గడుపుతుంటాడు. ఇక మరో పురుష పాత్ర తాగుబోతయిన యువకుడు. అతడు ఎల్లప్పుడూ మేడమ్ గది ముందు తచ్చాడుతూ ఉంటాడు. అతనిదో భగ్నమయిన ప్రేమ హృదయం. మండిలో కనిపించే మూడవ ప్రధానమయిన పురుష పాత్ర ఫోటో గ్రాఫర్‌ది. అతడు లోపలికీ బయటకూ తిరుగుతూ ఫోటోలు తీస్తుంటాడు. ఆ ఫోటోలే అతని జీవనాధారం. ఇక వేశ్యాగృహంలోని స్త్రీలంతా తమకో ఇల్లుండాలని, ఆశపడుతూంటారు. మేడమ్ రుక్మిణీబాయికి ఓ కూతురుంటుంది. ఆమె స్మితాపాటిల్. వీరిద్దరిదే ఆ వేశ్యాగృహంపై ఆధిపత్యం. ఆ ఆధిపత్యంపై ఎప్పుడూ సంఘర్షణ చెలరేగుతూ ఉంటుంది. రుక్మిణీ బాయి తర్వాత రెండవ స్థానంలో సోనీ రజ్దన్ గొప్పనటనని ప్రదర్శించింది. ఈ పాత్రలన్నింటి మధ్యా సాగే సంవాదాలూ, సరసాలూ అన్నింటి మధ్యా వేశ్యా గృహాల్లోనూ వాటి చుట్టూరా పేరుకుని ఉండే అనేక సమాజిక అంశాల్ని దర్శకుడు అన్యాపదేశంగా చూపిస్తూ పోతాడు.

'మండి'లో వేశ్యావృత్తి చుట్టూరా నడిచే ఆర్థిక వ్యవహారాలూ, మనుషుల అసంగత పద్ధతులూ కూడా కనిపిస్తాయి. సెక్సు కోసం అమ్మాయిల్ని ఎంపిక చేసుకోవడం బేరాలు అడ్డం, డబ్బు చేతులు మారడం, ఒప్పందాలు కుదుర్చుకోవడం అన్నీ మనకు చిత్రం నడుస్తున్న క్రమంలో కనిపిస్తూనే ఉంటాయి. అంతేకాదు వేశ్యాగృహం చుట్టూరా వెలిసే ఇతరవ్యాపారాలూ వాటి తీరుతెన్నులు కూడా 'మండి'లో

చర్చకు వస్తాయి. ఈ క్రమంలో ఆర్థిక పరమయిన అంశాల్ని దర్శకుడు తడుముతాడు. మొత్తం మీద చిత్రంలో 'కథ' కంటే కథనమూ, పాత్రల చిత్రీకరణ ప్రధానాంశంగా ఉంటుంది. వేశ్యల జీవనరీతులు, వారి దినచర్యలో ఇమిడి ఉండే అనేక శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక లావాదేవీలు చిత్రంలో చర్చకు వస్తాయి. అంతేకాదు వేశ్యాగృహాల చుట్టూ అల్లుకుని ఉండే రాజకీయాలూ ముందుకొస్తాయి.

'మండి'లో ప్రధాన పాత్రలు పోషించిన షబనా ఆజ్మీ, స్మితాపాటిల్, నసీరుద్దీన్ షా, ఓంపురిల నటన గొప్ప సమన్వయంతో సాగుతుంది. అయినప్పటికీ షబానా ఆజ్మీ ప్రధాన పాత్రలో ఉండి మిగతా పాత్రల్ని తనవెంట రాలీ చేస్తుంది. ఈ రోజుల్లో ప్రముఖులయిన మరెంతోమంది 'మండి' చిత్రంతో వెలుగు చూసినవారే. వారిలో నీనాగుప్త, అనితాకన్వర్, సోనీ రజ్దాన్, పంకజ్‌కపూర్, సతీష్ కౌషిక్‌లు ముఖ్యులు. వేశ్యావృత్తిని వేశ్యల మనస్థత్వాల్ని వాస్తవ దృక్పథంతో ఆవిష్కరింపజేసిన 'మండి' ఒక మంచి సినిమా.

●●●

# ఆద్మీ అవుర్ ఔరత్

**భాష** – హింది ,**స్క్రీన్‌ప్లే, దర్శకత్వం** – తపన్ సిన్హా; నటీనటులు: అమోల్ పాలేకర్, మహువారమ్ చౌదరి

**విడుదల:** 1984

**బెంగాల్ నుంచి ఎదిగి వచ్చిన మొదటి** తరం గొప్ప దర్శకుల్లో తపన్ సిన్హా ఒకరు. దర్శకుడిగా 1953లో మొదలైన ఆయన కెరీర్ ఇప్పటికీ చలన చిత్రాలు నిర్మిస్తూ ముందుకు సాగుతూ ఉంది. 'సఫేద్‌హాతీ' (1978) లాంటి బాలల చిత్రాలతో పాటు అనేక వైవిధ్యమైన కథాంశాలతో తపన్ దా చిత్రాలు తీశారు. ఒక స్త్రీ, ఒక పురుషుడు ఇలా రెండు పాత్రల్ని ప్రధాన పాత్రలుగా చేసుకుని వారి మధ్య అనుబంధాన్ని దగ్గరితనాన్ని ఆర్తిని చూపిస్తూనే చిత్రం చివరికి వచ్చేసరికి జాతీయ సమగ్రతని బోధించిన ఆయన చిత్రం 'ఆద్మీ అవుర్ ఔరత్' చాలా సీదాసాదాగా సాగుతుంది. అడవిలో వర్షంలో సాగుతూ కొంత ఉద్వేగాన్ని కలిస్తిస్తూ మొదట్నించి చివరిదాకా ఒకే టోన్‌లో సాగుతుంది.



చేతులో ఓ సంచితో ఓ యువతి పట్నానికి పోయే బస్ కోసం పల్లెరోడ్డుమీద ఎదురు చూస్తూ ఉంటుంది. ఆమెతో పాటు మరికొంత మంది కూడా అదే బస్ కోసం చూస్తూ ఉంటారు. కొంతసేపటికి బస్ వస్తుంది. కానీ ఆ బస్ టాప్ పైన కూడా జనంతో కిక్కిరిసిపోయి ఉంటుంది. బస్ వెళ్ళిపోయిన తర్వాత మిగిలిన మగవాళ్ళు లాభం లేదనుకుని గుంపుగా అడ్డదారిన పడి నడిచి వెళ్ళేందుకు బయలుదేరతారు. బిగ్గరగా మాట్లాడకుంటూ వెళ్ళిపోతారు. అప్పటి దాకా కూర్చుని ఉన్న ఆ యువతి లేచి నిలబడి తాను కూడా వారి వెనకాలే మెల్లగా నడిచి వెళ్ళేందుకు బయలుదేరుతుంది. వారితోపాటే బన్సీ అనే శికారి బయలుదేరతాడు. చేతిలో సంచిని ఊపుకుంటూ ఉత్సాహంగా నడుస్తూ ఉంటాడు బన్సీ ముందు వెళుతున్న మగవారి గుంపు చకచకా నడుస్తూ దూరమైపోతారు. బన్సీ వెనక్కి చూస్తాడు. వెనకాల ఆ యువతి మెల్లగా వస్తూ ఉంటుంది. బన్సీ ముందువాళ్ళను కేకేస్తాడు. వారికి వినపడదు. బన్సీ మెల్లగా నడిచి ఆమెతో కలిసి వెళదామని నడక వేగం తగ్గించి నప్పుడల్లా ఆమె మరింత స్లో అయిపోతుంది. ఇంతలో వర్షం మొదలవుతుంది. ఆమె అంతకు ముందు కంటే మరింత మెల్లగా నడక

సాగిస్తుంది. తరచుగా కూచుంటూ, శ్వాస తీసుకుంటూ నెమ్మదిగా నడుస్తూ ఉంటుంది. ఒకచోట ఆమె లేవలేనట్టుగా పడిపోతుంది. బన్సీ వెనక్కి వచ్చి ఆమెను సమీపిస్తాడు. అతను దగ్గరికి రావడంతో ఆమె బెంబేలెత్తుతుంది. బన్సీ దగ్గరికి వచ్చింతర్వాత తెలుస్తుంది. ఆమె గర్భవతి అని. ఆమె వకీల్ గంజ్‌లోని ఆస్పత్రికి బయలుదేరిందని బన్సీ తెలుసుకుంటాడు. ఆమెకు సాయం చేయాలనుకుంటాడు. ఇంతకీ ఆమె ఒంటరిగా ఎందుకు బయలుదేరిందని అడుగుతాడు. డబ్బులులేక అప్పుచేసి తన భర్త తనను పంపించాడని ఆ అప్పును తీర్చడానికి వడ్డీ వ్యాపారి వద్ద తన భర్త పనిచేస్తున్నాడని ఆమె చెబుతుంది. మెల్లగా ఇద్దరూ నడక సాగిస్తారు. ఆమె తన గత స్మృతుల్లోకి వెళుతుంది. మొదటిసారి గర్భం పోవడం ఇప్పుడూ అదే జరుగుతుందేమోనన్న భయంతో ఆమె ఆందోళన చెందుతూ ఉంటుంది. ఆమెను ఉత్తేజితురాల్ని చేస్తూ బన్సీ ఏదో ఒకటి మాట్లాడుతూ నడుస్తాడు. ఆమె కూలబడి పోవడంతో బన్సీ ఆమెను తన చేతులపైకి తీసుకుని నడవడం ఆరంభిస్తాడు. ఆమె బరువును ఎక్కువసేపు భరించలేని బన్సీ బొంగుల్ని విరిచి తాడుతో స్ట్రెచర్ లాగా కట్టి ఆమెను అందులో పడుకోబెట్టి లాగుకుంటూ వెళతాడు. ఆమెను స్పృహలో ఉంచడానికి ఏదో ఒకటి మాట్లాడుతూ ఉంటాడు బన్సీ. కొంతసేపటికి ఆమె స్పృహకోల్పోతూ ఉండడం చూసి బన్సీ సహాయం కోసం చుట్టుపక్కల అరుస్తాడు. నిరుత్తరుడై ఉన్న స్థితిలో ఫారెస్టు గార్డు కనిపించి ఆమె స్ట్రెచర్‌ను మోయడానికి సాయపడతాడు. చిన్న నది వద్దకు చేరింతర్వాత గార్డ్ తాను రాలేనని చెప్పి వెళ్ళిపోతాడు. వర్షంతో పెద్దదైన వాగును ఎలాగైనా దాటేందుకు బన్సీ నిర్ణయించుకుంటాడు. ఆమెను మెలుకవగా ఉండి సహకరించమని కోరుతూ ఆమెను తీసుకుని అతి కష్టంపై నదిని దాటుతాడు. నది దాటినతర్వాత ఓ బండిలో ఎక్కించుకుని జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళతాడు. అక్కడ బెడ్లు ఖాళీ లేవు తీసుకోలేమని అంటే పెద్దగొడవ చేయడంతో డాక్టర్ వచ్చి అడ్మిట్ చేసుకుంటాడు. బన్సీ తన పనిమీద తాను వెళ్ళిపోతాడు. భూస్వామి వద్ద పని లేకపోవడంతో తిరిగి ఆస్పత్రికి వస్తాడు. ఆ యువతికి ప్రసవం అయి మగబిడ్డ పుడతాడు. నీ పేరు చెప్పు రిజిస్టర్‌లో రాయాలని బన్సీని అడుగుతాడు డాక్టర్, ఆమె తనకేమీ కాదని రోడ్డుపై కలిసామని చెప్పి ఆమె వద్దకు వెళతాడు బన్సీ, పిల్లాడిని చూసి ఆమె భర్తపేరు అడుగుతాడు. అన్వర్ అని చెబుతుందామె. ఇంతదాకా తాను సాయం చేసింది ఓ ముస్లిం అమ్మాయికా అని బన్సీ ఆశ్చర్యపోతాడు. తాను పక్కా హిందు. అంతలోనే తేరుకుని ఆమె వైపు నవ్వుతూ చూస్తాడు. నేను వెళ్ళి మీ ఆయనకి ఈ సంగతి చెబుతానని అంటూ బన్సీ బయలుదేరతాడు. ఆమె అతనివైపు చేతులు జోడించి నీకోసం ఆ దేవున్ని ప్రార్థిస్తాను అంటుంది. చిత్రంలో అడవి, వర్షం నేపథ్యంలో అపరిచితులైన ఓ స్త్రీ, ఓ పురుషుడు వారి స్పందనలు, కేవలం మనుషులుగా మనసున్న మనుషులుగా వారి అనుబంధం చిత్రంలో గొప్పగా చిత్రించబడింది.

●●●

Click here to share your comments on this article.